సొంతిల్లు శిథిలమై.. దశాబ్దాల కష్టం ఆవిరై!

హైడ్రా పంజాతో రోడ్డునపడ్డ జీవితాలు.. కన్నీరు మున్నీరై బాధితుల ఆక్రందన

బ్యాంకుల్లో రుణాలతో నిర్మాణాలు.. ఒక్కొక్కరి తలపై రూ.కోటిన్నర అప్పు

పటేల్‌గూడలో తేరుకోని బాధితులు.. ఆత్మహత్యలే దిక్కు అంటూ ఆవేదన

పటాన్‌చెరు, అక్టోబర్ 15: సత్యనారాయణది ఒడిశా. హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం. 1998లో హైదరాబాద్‌లోని టర్బో పరిశ్రమలో ఉద్యోగిగా చేరాడు. 2009లో ఒడిశా వెళ్లిపోయాడు. తన కుమారుడికి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం రావటంతో హైదరాబాద్‌పై మనసు మళ్లింది. రిటైర్‌మెంట్ జీవితం హైదరాబాద్‌లోనే గడిపేద్దామనుకున్నాడు. తన వద్ద ఉన్న సేవింగ్స్, ఇతర ఆర్థిక వనరులను సమకూర్చుకుని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలో 167 గజాల ప్లాటును కొనుగోలు చేశాడు. అన్ని పత్రాలు, పంచాయతీ అనుమతులు, బ్యాంకు లోన్ సౌకర్యం, ఇతర సౌకర్యాలు చూసి ఆ స్థలాన్ని 2022లో కొన్నాడు. బ్యాంక్‌లోన్, ఇతర అప్పులు చేసి జీ ప్లస్ వన్ ఇండిపెండెంట్ హౌస్ నిర్మించుకున్నాడు. గత నెల 16న అంగరంగ వైభవంగా గృహప్రవేశం కూడా జరుపుకొన్నాడు. సరిగ్గా ఐదు రోజులకు సెప్టెంబర్ 21న గ్రామపంచాయతీ సిబ్బంది వచ్చి ఆదరబాదరగా వచ్చి ఇంటి గోడకు నోటీసు అంటించి వెళ్లిపోయారు. సంబంధిత స్థలం సర్వే నంబర్ 12 ప్రభుత్వానిదని, హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం యాక్షన్ తీసుకోబోతున్నదని ఆ నోటీసు సారాంశం. సత్యనారాయణకు ఏం అర్థంకాక పంచాయతీ అధికారులు, స్థలం అమ్మిన వెంచర్ యజమానిని అడిగారు. వారు పరిస్థితిని సర్దుతామని, ఎక్కడో తప్పు జరిగిందని, మీరున్నది సర్వే నంబర్ 6 అని, అది ప్రైవేటు సర్వే నంబర్ అని నమ్మించారు. అదే సమయంలో సత్యనారాయణ భార్యకు జ్వరం రావటంతో 21న దవాఖానలో జాయిన్ చేశాడు. దవాఖానలో భార్య చికిత్సకోసం ఉండగానే 22న తెల్లవారే ఆయన ఇంటిని హైడ్రా బృందం కూల్చేస్తున్నదని ఫోన్ వచ్చింది. హుటాహుటిన దవాఖాన నుంచి తన ఇంటికి వచ్చిన సత్యనారాయణను ఇంటి వద్దకు కూడా వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఎంత మొత్తుకున్నా సామగ్రిని బయటకు పారవేసి కండ్ల ముందే ఇంటిని కూల్చేశారు. జీవితమంతా కష్టపడి సంపాదించిన డబ్బు కండ్ల ముందు ఇటుక పెల్లలుగా మిగిలిపోయింది. ఒక్కో ఇంటిలో ఒక్కో బాధితుడిది ఒక్కో కథ. అసలు వారు చేసిన తప్పు చెప్పేందుకు అన్ని పర్మిషన్లు ఇచ్చిన పంచాయతీ ముందుకు రావటంలేదు. అది అసలు ఏ సర్వే నంబరో చెప్పేందుకు సర్వేయర్లు కనిపించటం లేదు. బ్యాంకర్లు లీగల్‌గా ఎందుకు పప్పులో కాలేశారో..! రూ.కోట్ల రుణాలు ఎలా ఇచ్చారో అర్థం కాక నిట్టూరుస్తున్నారు.

బలవంతంగా తన్ని తరిమేస్తున్నారు: బాధితులు

ఇండ్లలో నివాసం ఉంటే బలవంతంగా ఖాళీ చేయించబోమన్న హైడ్రా కమిషనర్, ముఖ్య అధికారుల మాటలకు.. క్షేత్రస్థాయిలో హైడ్రా సిబ్బంది, రెవెన్యూ యంత్రాంగం, మున్సిపాలిటీ సిబ్బంది హడావిడికి సంబంధం ఉండటం లేదు. హైడ్రా పేరున తమకు విపరీత శక్తులు వచ్చాయనే భావనలో పలు శాఖలు వ్యవహరిస్తున్నాయి. వీరికి మద్దతుగా పోలీసులు, మూడంచెల హైడ్రా భద్రత సిబ్బంది.. నిరసనకారులు, ఇండ్లలో ఉన్నవారిని బలవంతంగా దూరంగా తన్ని తరిమేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు కనిపించినా మొదటి అంచెలోనే తిప్పి పంపిస్తున్నారు. కోర్టు ఆర్డర్లు, ఇండ్లలో ఉన్న యజమానుల కోణం, పత్రాలను అసలే పట్టించుకోవటం లేదు. ఈనెల 22న ఆదివారం వందలాదిగా వచ్చిన హైడ్రా సిబ్బంది పటేల్‌గూడలో జేసీబీలు, బుల్డోజర్లతో స్వైరవిహారం చేశారు. సర్వే నంబర్ 12 అని చెప్పి 26 ఇండిపెండెంట్ హౌస్‌లను కూల్చేశారు. అక్కడ 32 ప్లాట్లు ఉండగా వాటిలో 1 నిర్మాణం కాలేదు. వాటిలో 26ని పూర్తిస్థాయిలో నేలమట్టం చేశారు. ఆయా ఇండ్ల యజమానులు ఎంత ఎడ్చినా, బతిమాలినా, కాళ్లు పట్టుకొని కనికరించాలని వేడుకున్నా అధికారులు స్పందించలేదు. తమ ఇంటిని కూల్చివేయకుండా ఫైన్ వేస్తే కట్టుకుంటామని కూడా కొందరు ఇండ్ల యజమానులు బతిమాలారు. పంచాయతీకి ట్యాక్స్‌లు కట్టామని, వెంచర్‌కు కూడా పర్మిషన్లు ఉన్నాయని చెప్పినా అరణ్యరోదనలుగానే మిగిలిపోయాయి. సర్వే నంబర్ 12 అని అధికారులు గుర్తించినప్పుడు రెండంతస్థుల ఇంటి నిర్మాణం పూర్తి అయ్యేవరకు ఎలా ఉపేక్షించారని బాధితులు నిలదీస్తున్నారు. హైడ్రా పేరుతో జరుపుతున్న అరాచకంతో తాము నిరాశ్రయులమయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 3న పటేల్‌గూడ పంచాయతీ అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనమైంది. ఆ వెనువెంటనే హైడ్రా 26 ఇండ్లను నేలమట్టం చేసింది.

అన్ని అనుమతులున్నా కూల్చివేశారు

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నాయి. పంచాయతీ అనుమతి, ఇంటి నంబరు ఉన్నప్పటికీ మా ఇంటిని కూల్చివేశారు. ముందస్తుగానే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలమని గుర్తిస్తే ఇల్లు కొనుక్కునేవాళ్లం కాదు. ఇంత నష్టపోయేవాళ్లం కాదు. దీనికంతటికి బాధ్యులు అధికారులే. కానీ, మమ్మల్ని దోషులుగా చేసి జీవితంలో పూరించుకోలేనంతగా నష్టం చేశారు. గత ప్రభుత్వం, ప్రభుత్వ స్థలాల్లో కట్టుకున్నవారికి 58, 59 జీవోల ద్వారా క్రమబద్ధీకరించారు. ఈ ప్రభుత్వానికి ఆ జీవోలు వర్తించవా? కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చి జీవితాలను నాశనం చేశారు.

-రాజు, బీరంగూడ

పైసాపైసా కూడపెట్టి కొన్న ఇంటిని కూల్చారు

ఎంతో కష్టపడి పైసా పైసా కూడపెట్టుకుని కొనుక్కున్న ఇంటిని గంటలోనే కూల్చివేశారు. మేము అన్ని డాక్యుమెంట్లు చూసే కొనుక్కున్నాం. అధికారులు తప్పు చేస్తే దానికి మేమా బాధ్యులం? ఆ తప్పు ప్రభుత్వానిది కాదా? తప్పు చేసిన వారిని వదిలిపెడుతున్నారు. ప్రభుత్వ అధికారులు అయినంత మాత్రాన ప్రభుత్వం వెనకేసుకొస్తుందా? మాలాంటి సామాన్యులను బలిచేస్తే మీ ప్రభుత్వానికి ఏమొస్తుంది? మా ఇల్లు కూల్చినప్పటి నుంచి మా భార్య, పిల్లలు తిండి, నిద్ర లేకుండా బతుకుతున్నాం. మళ్లీ ఒక ఇల్లు కట్టుకోవాలంటే మా జీవితం సరిపోదు. పేదవాళ్లకు న్యాయం చేసే ప్రభుత్వం ఉండాలి గాని అన్యాయం చేసే ప్రభుత్వాలు ఉంటే భవిష్యత్తు ఉండదు.

- సంతోష్, బీరంగూడ

జీవితమంతా కష్టపడి ఇల్లు కట్టుకున్నా

జీవితమంతా కష్టపడుతూనే ఉన్నా సారు. నా సొంతూరు రాజమండ్రి. చిన్నప్పుడే ఒడిశాకు వెళ్లి సెటిలయ్యాం. 1998లో ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వచ్చా. 2009 వరకు ఇక్కడే ఉన్నా. ఆ తర్వాత ఒడిశా వెళ్లిపోయాను. నా కొడుక్కి జాబ్ రావడంతో హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యాం. 2022లో ఈ స్థలం సర్వే నంబర్ 6లో ఉన్నదని నిర్భయంగా కొన్నాం. ఇది ప్రభుత్వ స్థలం అని వారం కిందట అధికారులు నోటీసు పంపారు. గృహ ప్రవేశమైన ఆరు రోజుల్లోనే ఇంటిని కూల్చేశారు. దాదాపు రూ.కోటిన్నర ఖర్చు చేశాను. రిటైర్మెంట్‌లో ప్రశాంతంగా ఇక్కడే ఉందామని నా సంపాదన అంతా ఇక్కడే ధారపోశాను. అప్పులు కూడా చేశాను. ఇప్పుడు కూలిన ఇంటిని చూసుకుంటున్నా. ఇల్లును జలవనరుల్లో నిర్మించలేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ అసలే కాదు. ఇక్కడ జరిగిన నష్టంపై విచారణ చేయాలి.

-బీ సత్యనారాయణ, పటేల్‌గూడ, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

ఇల్లు కూల్చివేయడంతో అప్పులే మిగిలాయి

నేను మేస్త్రీగా పనిచేస్తున్నా. సర్వే నంబర్ 6లో స్థలం ఉన్నదని తెలిసి ప్లాటు కొన్నా. అప్పులు చేసి సొంత ఇంటిని నిర్మించాను. నిర్మాణరంగంలో అనుభవం ఉండటంతో పక్కన కడుతున్న ఇండ్లను కూడా గుత్తేదారుకి తీసుకుని పనులు చేసుకుంటున్నాను. ఇప్పుడు హైడ్రా వచ్చి నేను కట్టిన ఇంటిని కూల్చేసింది. గుత్తేదారుడిగా ఉన్న ఇంటిని కూడా కూల్చేశారు. రెండు ఇండ్లు పోవడంతో అప్పులే మిగిలాయి. ఇంటి గృహ ప్రవేశాలు చేసిన కొద్దిరోజుల్లోనే కూల్చివేశారు. అప్పులు ఇచ్చినవారు ఫోన్లు చేస్తున్నారు. ప్రకాశం జిల్లా నుంచి 2004లో హైదరాబాద్ వచ్చాను. 20 ఏండ్లుగా కష్టపడి మేస్త్రీ పనులు చేస్తున్నాను. జీవితంలో స్థిరపడుతున్నాను అనుకుంటున్న టైంలో హైడ్రా తొందరపాటు వల్ల అన్ని నష్టపోయి రోడ్డునపడ్డాను.

- శివరావు, పటేల్‌గూడ, అమీన్‌పూర్ మున్సిపాలిటీ

కమలనాథులు.. నోరుమెదపరేమీ?

- ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసంపై మౌనం
- కనీసం సమీక్ష నిర్వహించని కేంద్రమంత్రులు
- బీజేపీ యూ టర్న్‌పై నెటిజన్ల మండిపాటు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఏ చిన్న ఘటన జరిగినా మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీ నాయకులు సికింద్రాబాద్‌లో సోమవారం జరిగిన ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం కేసులో నోరు మెదపకపోవడంపై సోషల్‌మీడియాలో చర్చకు దారితీసింది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఘటనాస్థలికి వెళ్లలేదు సరికదా.. అంగతకుడు ఎవరు? కుట్ర ఉందా? స్థానిక పోలీసుల వైఫల్యం ఉందా? అనే విషయాలపై ఆరా తీయలేదు. స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల పేరుతో 'ప్రత్యేక' తరగతులు జరుగుతున్నాయని, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారు ఉంటున్నారని స్థానికులు మొత్తుకుంటున్నా.. కేంద్ర మంత్రులుగా పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 'దోస్తీ పాలిటిక్స్‌లో హిందుత్వ సిద్ధాంతానికి బీజేపీ ఎంపీలు పాతర వేస్తున్నారని సోషల్‌మీడియాలో పోస్టులు వెలిశాయి. హైదరాబాద్‌లో మతపరమైన విషయంలో ఆందోళనలపై కేంద్ర హోం సహాయ మంత్రి సోయి లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. నాడు ప్రతిదీ రాష్ట్ర సమస్య... నేడేమో జాతీయ సమస్యగా డైవర్షన్ పాలిటిక్స్.. నాడు రాజీనామా డిమాండ్‌తో రంకెలు.. నేడు సన్నాయి నొక్కులు.. శపథాలు శివాలు ఎటువాయే? అంటూ బీజేపీ నాయకులపై ప్రశ్నలవర్షం కురిపించారు. అప్పుడు రక్తాలు ఉడికిపోయాయి, అధికారి మార్పిడితో చల్లబడ్డాయా.! వ్యక్తిగత లబ్ధి రాజకీయాల్లో సిద్ధాంతాన్ని ఫ్రిడ్జ్‌లో పెట్టేశారా? ఎన్నికలప్పుడే హిందుత్వంపై పొరుషం, పొడుచుకు వస్తుందా? ప్రజలు అన్ని గమనిస్తున్నారనే విషయాన్ని మరుస్తున్నారా? అంటూ ఘాటుగా బీజేపీ నాయకుల వైఖరిపై మండిపడ్డారు.

కూల్చుడు కుదరదు

మొదటిపేజీ తరువాయి...

పిటిషనర్లకు ఉన్నదని తెలిపింది. సంగారెడ్డి జిల్లాలోని రెండు వేర్వేరు భూముల్లోని నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా చర్యలను సవాలు చేస్తూ, హైడ్రా ఏర్పాటు జీవో 99ని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాల్లో ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రాకు, ఇతర ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

హైడ్రా ఏర్పాటు చెల్లదు

పిటిషనర్ల తరపున న్యాయవాదులు టీ సుధాకర్‌రెడ్డి, జే విజయలక్ష్మి వాదనలు వినిపిస్తూ ప్రైవేట్ పట్టా భూముల్లోకి హైడ్రా చొరబడి దౌర్జన్యంగా కూల్చివేత చర్యలకు పాల్పడినట్టు తెలిపారు. చట్టసభ ద్వారా హైడ్రా ఏర్పాటు కావాలని, ప్రభుత్వం జీవో 99 ద్వారా హైడ్రా ఏర్పాటు చేయడం చెల్లదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 14, 21, 300ఏ అధికరణాలకు ఇది వ్యతిరేకమని వాదించారు. వాల్టా లాంటి చట్టాలను చేసిన తర్వాతే ప్రభుత్వం వాటిని అమలు చేసిందని గుర్తుచేశారు. చట్టసభతో సంబంధం లేకుండా జీవోతో హైడ్రా ఏర్పాటు చెల్లదని పేర్కొన్నారు. గత నెల 3వ తేదీన హైడ్రా ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టిన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఉదయమే పోలీసు బలగాలతో వచ్చిన హైడ్రా అధికారుల కూల్చివేతలకు పాల్పడ్డారని తెలిపారు. చట్టాలకు విరుద్ధంగా ఇచ్చే పాలనా పరమైన అధికారాలు చెల్లవని తెలిపారు. జీవో 30 ద్వారా జీహెచ్‌ఎంసీ అధికారాలను హైడ్రాకు అప్పగించిందని, ఇది జీహెచ్‌ఎంసీ చట్టానికి విరుద్ధమని పేర్కొన్నారు. చట్టం కింద ఏర్పాటైన సంస్థకే అధికారాలు ఉంటాయని, మరో సంస్థకు బదలాయించాలంటే చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించాలని, ఆ విధంగా చేయని హైడ్రా చెల్లదని వివరించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న హైకోర్టు.. హైడ్రా ఏర్పాటు జీవో 99ను సవాల్ చేసిన పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం విచారణ చేయాల్సి ఉంటుందని తెలిపింది. హైడ్రా చట్ట వ్యతిరేక చర్యలు, హైడ్రా ప్రైవేట్ పట్టా భూముల్లోకి వచ్చి కూల్చివేతల వ్యవహారాలపై విచారణ చేస్తామని తెలిపింది. నిజాం కాలం నాటి తెలంగాణ రెవెన్యూ చట్ట ప్రకారం చెరువులు, కుంటల పరిరక్షణకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు, ఆక్రమణల తొలగింపునకు ఏవిధమైన నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదని చెప్పింది. ఇలాంటి వ్యవహారాలపై భూములు, చెరువుల సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులకు అధికారం ఉందని గుర్తు చేసింది. చట్ట ప్రకారం హైడ్రా ఏర్పాటు చేసే అధికారం కూడా ప్రభుత్వానికి ఉందని అభిప్రాయపడింది. అయినప్పటికీ ఈ వ్యాజ్యాల్లో ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ సమయంలో ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ జోక్యం చేసుకుని, జీవో 99 ద్వారా హైడ్రా ఏర్పాటు తర్వాత ఆర్డినెన్స్ వెలువడిందని, ఈ నేపథ్యంలో పిటిషన్లపై విచారణ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. భయాందోళనలతో పిటిషన్లు వేశారని చెప్పగానే కల్పించుకున్న న్యాయమూర్తి హైదరాబాద్ పరిసరాలకు పరిమితమైన హైడ్రా గ్రామాలకు కూడా వస్తుందనే భయంతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని వ్యాఖ్యానించారు. ఆక్రమణల తొలగింపు చర్యలు కూడా చట్ట నిబంధనలకు లోబడే ఉండాలని తేల్చి చెప్పారు. విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారు.

మూసీ ప్రాంత బాధితుల కేసులో..

మూసీ ప్రాంతంలోని తమ ఇండ్లను ఎర్ర అక్షరాలతో ఆర్‌బీ–ఎక్స్ అని మార్కింగ్ చేయడంతో భయాందోళనలకు గురైన పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాలను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారించారు.



పిటిషనర్ల ఆస్తుల విషయంలో చట్ట నిబంధనలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలోని పేట్లబురుజు ప్రాంతానికి చెందిన ఎస్ మహేందర్‌సింగ్‌దాస్ సహా 15 మంది నివాసితులు హైకోర్టును ఆశ్రయించారు. హైడ్రా, మున్సిపల్, రెవెన్యూ అధికారులు తమ ప్రాంతంలోని ఇండ్లను కూల్చివేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మూసీనది ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఆ భూమి ఉందని అధికారులు సర్వే చేసి పిటిషనర్ల ఇళ్లపై ఎర్ర రంగుతో మార్కింగ్ చేశారు. మూసీ నది బఫర్ జోన్ పరిధికి వెలుపల పిటిషనర్ల ఇండ్లు ఉన్నాయని, మూసీ పరీవాహక ప్రాంతం చుట్టూ నిజాం కాలంలోనే నిర్మించిన సరిహద్దు గోడకు వెలుపల ఉన్నాయని న్యాయవాది విజయలక్ష్మి వాదించారు. మహేందర్ సింగ్ ఈ ప్రాంతంలోని గురుద్వారా, హనుమాన్ ఆలయానికి సంరక్షకుడుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నిజాం ప్రభుత్వం ఇచ్చిన భూమిలో గత 80 ఏండ్లుగా అక్కడ నివాసం ఉంటున్నారని తెలిపారు. వాదనల అనంతరం పిటిషనర్ల విషయంలో ప్రభుత్వ అధికారుల చర్యలు చట్ట నిబంధనలకు లోబడి ఉండాలని ఆదేశిస్తూ పిటిషన్లపై విచారణ ముగిసినట్టు న్యాయమూర్తి ప్రకటించారు.

హైడ్రా చట్టబద్ధతపై వేర్వేరు పిటిషన్లు

హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 99కి చట్టబద్ధత లేదంటూ హైదరాబాద్ నానక్‌రామ్‌గూడకు చెందిన డీ లక్ష్మి, మల్కాజిగిరికి చెందిన ఎండీ అహ్మద్ అజీమ్ వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి మంగళవారం విచారించారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లోని సర్వే నెం 119/21, 1199/22లో 19.27 ఎకరాల ప్రైవేట్ పట్టా భూమిలోకి హైడ్రా అధికారులు చొరబడి వ్యవసాయ పరికరాలు, కూలీల విశ్రాంతి నిమిత్తం ఏర్పాటు చేసిన నిర్మాణాలను కూల్చేశారని లక్ష్మి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామంలోని సర్వే 133/ఏఏ, 133/ఈఈల్లోని 838.89 చదరపు గజాల స్థలంలో నిర్మాణాలను ఏకపక్షంగా నోటీసు కూడా ఇవ్వకుండా కూల్చేశారని అజీమ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

రేపు బీఆర్ఎస్వీ సమావేశం

- హాజరుకానున్న కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ప్రతినిధుల సభను ఈనెల 17న తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, జిల్లా కోఆర్డినేటర్స్, ప్రతి నియోజకవర్గం నుంచి 10 మంది విద్యార్థి ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

'మేడ్చల్ మల్కాజిగిరి'లో చెరువుల సర్వే

మేడ్చల్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపు సర్వే కొనసాగుతున్నది. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో 620 చెరువులు ఉన్నాయి. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపులో భాగంగా మొదటి దశలో 97 చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపు పూర్తయింది. మరో 110 చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వీటి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపు సర్వే కొనసాగుతున్నది. మిగతా 413 చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపు సర్వేను మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

తిరుపతి లడ్డూపై ఐజీ, డీఐజీతో సిట్

- ఇద్దరి పేర్లు వెల్లడించిన డీజీపీ

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కేసు వ్యవహారాన్ని తేల్చేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సిట్‌లో ఇద్దరు ఏపీ అధికారులు ఉండనున్నారు. ఇందుకోసం ఇద్దరి పేర్లను ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం విజయవాడలో ప్రకటించారు. కేంద్రం నుంచి ఇద్దరు, ఏపీ పోలీసుల నుంచి ఇద్దరు, ఒక ఫుడ్ కంట్రోల్ అధికారితో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు సిట్ సభ్యులుగా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డీఐజీ గోపీనాథ్ జెట్టి పేర్లను పంపినట్లు డీజీపీ వెల్లడించారు. కల్తీ నెయ్యి కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీంకోర్టు అనుమానించలేదని స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఏపీ పోలీసుల జోక్యం ఉండబోదని ఆయన తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయం, గన్నవరం పార్టీ ఆఫీసుపై దాడి కేసులతో పాటు మరో రెండు కేసులను సీఐడీకి బదిలీ చేసినట్లు తెలిపారు. ఒక కేసులో వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డిపై లుకౌట్ నోటీసును గుంటూరు జిల్లా ఎస్పీ జారీ చేశారని చెప్పారు.

సికింద్రాబాద్‌లో రెండోరోజూ ఉద్రిక్తత

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాల ధ్వంసం ఘటనపై రెండో రోజైన మంగళవారం కూడా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి, అతడి వెనుక ఎంతమంది ఉన్నారనే విషయాన్ని నిగ్గుతేల్చాలంటూ స్థానికులు డిమాండ్ చేశారు. ముత్యాలమ్మ ఆలయానికి ఎదురుగానే ఉన్న హోటల్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల కోసమని వచ్చిన 140 మందిలో చాలా మంది స్వస్థలాలకు వెళ్లిపోయారు. స్పోకెన్ ఇంగ్లిష్ పేరిట మతఛాందసవాద తరగతులను నిర్వహిస్తున్నట్టు స్థానికులు ఆరోపించారు. ముత్యాలమ్మ ఆలయానికి ముందు ఈ హోటల్ ఉండగా, వెనుక వైపు ప్రార్థనా మందిరం ఉన్నది. హోటల్ నుంచి అక్కడికి వెళ్లే వారంతా ఈ గుడి ముందు నుంచే వచ్చిపోతుంటారు. ఈ నేపథ్యంలోనే హోటల్‌పై పోలీసులు దాడి చేసి, కంప్యూటర్లు, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కొత్త వారందరినీ ఖాళీ చేయించి స్వస్థలాలకు పంపించారు. ఇతర ప్రార్థనా మందిరంలో బసచేసిన యువకులూ స్వస్థలాలకు వెళ్లిపోయారు. నిందితుడు దవాఖానలో పోలీసులకు సహకరించలేదని సమాచారం. ఉన్మాదిగా మారిన ఆ వ్యక్తిపై ఇప్పటికే ముంబైలో రెండు కేసులు ఉన్నాయని సమాచారం. అతని గత చరిత్ర గురించి ఆరా తీసేందుకు పోలీస్ బృందాన్ని ముంబైకి పంపారు. ఈ ఘటనపై, నిందితుడి వివరాలపై ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. బుధవారం ఈ ఘటనపై స్పష్టత ఇస్తామంటూ నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాల్ వెల్లడించారు.

ఆధార్ ఉంటేనే పత్తి కొనుగోలు

- 148 మిల్లులు కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాం
- 'నమస్తే తెలంగాణ' కథనంపై మార్కెటింగ్ శాఖ వివరణ

హైదరాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామని, కేంద్రాలకు రైతులు ఆధార్ తేవాలని మార్కెటింగ్ శాఖ తెలిపింది. 'నమస్తే తెలంగాణ'లో 'పత్తి కొనుగోళ్లు ఏమాయే' శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనంపై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ వివరణ ఇచ్చారు. 148 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశామని తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతా నంబర్‌కు ఆధార్‌తో లింకు ఉండాలని, ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా కొనుగోళ్లు జరుగుతాయని చెప్పారు. 321 జిన్నింగ్ మిల్లులు టెండర్లలో పాల్గొన్నాయని తెలిపారు. వాట్సాప్ ద్వారా కొనుగోలు కేంద్రాల వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. వరంగల్, ఖమ్మం మార్కెట్లలో 30–35శాతం తేమగల పత్తి రూ. 5000 నుంచి రూ. 6950 ధర పలుకుతున్నదని తెలిపారు. మద్దతు ధర రూ. 7521 కన్నా తక్కువ ధర పలుకుతున్నదని స్పష్టం చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో 8–12 శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తారని తెలిపారు.

12 మంది సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 12 మంది సబ్ రిజిస్ట్రార్లను ప్రభుత్వం బదిలీ చేసింది. మరో ఏడు మందిని డిప్యూటేషన్‌పై ఇతర చోట్లకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో 23